క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



మల్హర్: మండలంలో పెద్ద తూండ్ల గ్రామానికి చెందిన నల్లాల రామయ్య ఓపెన్‌హార్ట్ సర్జరీ సమస్యతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆర్థిక సాయం కోసం కుటుంబ సభ్యులు మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.2.50 లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించి మంత్రి శ్రీధర్‌బాబు ఆస్పత్రి సహయకుడు ద్వారా హైదరాబాద్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎల్‌ఓసీ పత్రానికి కుటుంబ సభ్యులకు అందించారు.

సింగంపల్లిలో గ్రామసభ



మహాముత్తారం: వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని సింగంపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. గ్రామ సభలో విద్య, వైద్యం, తాగునీరు, పరిశుభ్రతతో పాటు మోడల్ గ్రామ పంచాయతీగా తయారు చేయుటకు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పిరమల్ ఫౌండేషన్ సభ్యుడు, ఏపీఓ కుమారస్వామి, ఈసీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి వీరయ్య, టీఏ ప్రమీల, అంగన్‌వాడీ కార్యకర్త రమాదేవి, ఏఎన్‌ఎం భూలక్ష్మి, ఆశ వర్కర్ సంతోష, ఫీల్డ్ అసిస్టెంట్ సదానందం, ఉపాధ్యాయురాలు హేమలత పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

కాటారం: మండలంలోని గంగారంలో ఓ యువకుడు గురువారం ఉరేసుకొని ఆత్మహత్యకు చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగారానికి చెందిన ముల్కళ్ల మహేశ్(27) బీటెక్ పూర్తి చేసి హైదరాబాద్‌లో రెండేళ్ల పాటు ప్రైవేటు ఉద్యోగం చేశాడు. మెరుగైన జీవనోపాధి కోసం విదేశాలకు వెళ్లే ప్రయత్నంలో ఉన్నాడు. ఇటీవల రాఖీ పౌర్ణమి సందర్భంగా స్వగ్రామానికి వచ్చాడు. ఉదయం తన తల్లిదండ్రులు లక్ష్మయ్య, పద్మను ద్విచక్రవాహనంపై పొలం వద్ద దింపేసి వచ్చాడు. సాయంత్రం వారు ఇంటికి వచ్చే సరికి మహేశ్ ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడి ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సెల్‌ఫోన్ చెక్ చేయగా ఓ నంబర్‌నుంచి వీసా రిజక్ట్ అయిందని మెసేజ్ రావడంతో పాటు మరో నంబర్‌కు నాలుగు సార్లు వాట్సాప్ కాల్ మాట్లాడినట్లు ఉందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

టేకుమట్ల: రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలైన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మేకల రాజేశ్వరీ ఇంటి నుంచి బస్టాండ్ కూడలికి నడుచుకుంటూ వస్తుంది. ఈ క్రమంలో మండలంలోని రామకిష్టాపూర్(వీ) గ్రామానికి చెందిన అనిల్ అనే యువకుడు మరో ఇద్దరితో కలిసి ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చి మహిళను ఢీకొట్టాడు. దీంతో ఆమె కాలు విరగగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి భర్త సదయ్య ఫిర్యాదు మేరకు అనిల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోగికారి ప్రసాద్ తెలిపారు.

ఆర్థికసాయం

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మండలంలోని లింగాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఊకే నాగేశ్వర్‌రావు తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ శుక్రవారం పరామర్శించి రూ.8వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట మేడారం జాతర మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ అర్రెం లచ్చుపటేల్, మాజీ సర్పంచులు ఇర్ప సునీల్‌దొర, మంకిడి నరసింహస్వామి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతి, కిసెన్ సెల్ మండల అధ్యక్షుడు రవికుమార్, మాజీ ఎంపీటీసీ పోతరాజు, నాయకులు గడ్డం భూషనం, ప్రశాంత్, జైపాల్‌రెడ్డి ఉన్నారు.

చెక్కుల పంపిణీ

గోవిందరావుపేట: మండలంలోని దుంపల్లిగూడెం గ్రామానికి చెందిన మురహరి అంజలి, రాంనగర్ గ్రామానికి చెందిన భూక్య స్వరూప ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. కాగా, సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకోగా వారికి చెక్కులు మంజూరయ్యాయి. దీంతో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లాకవత్ నరసింహ చెక్కులను శుక్రవారం అందించారు. ఈ కార్యక్రమంలో మల్లేశ్‌గౌడ్, బాలాజీ, రాజశేఖర్, స్వామి, బిక్కు, లక్ష్మణ్, లాలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



మహాముత్తారం: నిల్వ నీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది

మొగుళ్లపల్లి: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటామని మండల వైద్యాధికారి డాక్టర్ నాగరాణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మహాత్మజ్యోతిరావుపూలే రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు హెల్త్ ఎడ్యుకేషన్‌పై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగరాణి మాట్లాడుతూ.. పిల్లలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. జంక్ ఫుడ్స్ తినొద్దని, వేడి వేడి ఆహర పదార్థాలు తినాలన్నారు. చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. అలాగే పాత ఇస్సిపేట గ్రామంలో డాక్టర్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జ్వర పీడితులను గుర్తించి రక్త నమూనాలు తీసి ల్యాబ్ పంపించారు. జ్వరం వచ్చినట్లయితే వైద్య సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రేష్మ, హెల్త్ సూపర్‌వైజర్ జమున, హెల్త్ అసిస్టెంట్ భిక్షపతి, ఏఎన్‌ఎంలు విద్యార్థులు పాల్గొన్నారు.

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలం గొర్లవీడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. 65 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయురాలు అనిత తెలిపారు. నలుగురు విద్యార్థులకు స్కిన్ ఎలర్జీ ఉన్న కారణంగా వారిని భూపాలపల్లి 100 పడకల ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు డాక్టర్ రవి పేర్కొన్నారు. అదేవిధంగా ఆప్తాల్మిక్ ఆఫీసర్ రవికుమార్ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి ఎనిమిది మంది విద్యార్థులకు కళ్ల అద్దాల కోసం రెఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్ట్ రోజా, ఏఎస్‌ఎం జగదీశ్వరీ, ఉపాధ్యాయులు దేవదాసు, జయ ప్రకాశ్, శంకర్రావు, వెంకటేశ్వర్లు, కటంగూరు వంశీ, కుమారస్వామి, మేనక, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ములుగుపల్లిలో డ్రైడే..

మహాముత్తారం: డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా మండలంలోని ములుగుపల్లి గ్రామంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి లక్ష్మి ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటా తిరుగుతూ నీటి నిల్వలను గుర్తించి పారబోశారు. వర్షాకాలం కావడంతో నీటి నిల్వల వల్ల దోమలు వృద్ధి చెంది రోగాలు వస్తాయన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రమీల, రాజసమ్మక్క, స్వప్న, లక్ష్మి, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కాటారం: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని వ్యాధులకు దూరంగా ఉండాలని మండల వైద్యాధికారిని మౌనిక సూచించారు. మండలంలో శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డ్రై డే నిర్వహించారు. కాటారం, గోపాలపూర్‌లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసి జ్వర సర్వే చేపట్టారు. వైద్యులు, వైద్య సిబ్బంది ఇంటింటా తిరుగుతూ నీరు నిల్వ లేకుండా చూసుకోవడంతో పాటు సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు సుమన్, వందన, సీహెచ్‌ఓ నిర్మల, సబ్ యూనిట్ ఆఫీసర్ రమేశ్, హెల్త్ అసిస్టెంట్లు రాజు, సమ్మయ్య, ఏఎన్‌ఎంలు శ్యామల, రజిత, ఆశాలు లత, రమ, స్వరూపారాణి, సరిత, సంధ్య పాల్గొన్నారు.



భూపాలపల్లి రూరల్: గొర్లవీడులో..



కాటారంలో..



మొగుళ్లపల్లి: మాట్లాడుతున్న డాక్టర్ నాగరాణి

సభ్యత్వ నమోదులో భాగస్వాములు కావాలి



చిట్యాల: మాట్లాడుతున్న యుగదీశ్వర్

టేకుమట్ల: బీజేపీ సభ్యత్వ నమోదులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బట్టు రవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. త్వరలో ప్రారంభం కానున్న సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బీజేపీ సైనికులు అధిక సభ్యత్వ నమోదులో పాలు పంచుకోవాలన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తిరెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దేశెట్టి గోపాల్, ప్రధాన కార్యదర్శి గుర్రపు నాగరాజు, బండారి సమ్మయ్య, నాయకులు తిరుపతి, కుమార్, సిద్దు, మహేందర్, లక్ష్మయ్య, రమేశ్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కన్నం యుగదీశ్వర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 2 నుంచి మొదలయ్యే బీజేపీ సభ్యత్వ నమోదులో బూత్ నుంచి సుమారు 200 మందితో సభ్యత్వాలను చేపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కమిటీ వైస్ చైర్మన్ నాగపూరి రాజమౌళిగౌడ్, శ్రీపెల్లి అనిల్, గజనాల రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, పూర్ణ, శ్రీకాంత్, ప్రభాకర్, మహేష్, రాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనది



కాటారం: రవిశంకర్ దంపతులను సన్మానిస్తున్న అధికారులు

కాటారం: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనదని, ఒక ఉపాధ్యాయుడు తన మేధస్సుతో అనేక మందిని ఉన్నత స్థానంలో నిలుపుతాడని ఐటీడీఏ ఏటూరునాగారం ఏటీడీఓ దేశీరాంనాయక్ అన్నారు. కాటారం మండలం మేడిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం గోదారి రవిశంకర్ పదవి విరమణ కార్యక్రమం శుక్రవారం పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా రవిశంకర్ దంపతులను శాలువాలు, గజమాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడ, కరీంనగర్ ఏటీడీఓలు భాస్కర్, దివాకర్ రావు, పలు పాఠశాలల హెచ్‌ఎంలు రాజరత్నం, బాలకృష్ణ, స్వరూప, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడికి సన్మానం

రేగొండ: మండలంలోని రేపాక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడిగా పని చేసి పదవీ వరమణ పొందిన వీరగంటి రవీందర్‌ను ప్రధానోపాధ్యాయుడు రాజు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ రమ, మాజీ ఎంఈఓలు పగడాల ఐలయ్య, గుండు సారంగపాణి, ప్రధానోపాధ్యాయులు కృష్ణ, సూరం లక్ష్మీ, ఊర్మిల, అనితా రెడ్డి, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు దుస్స సధాకర్, ప్రధాన కార్యదర్శి సూదం సాంబమూర్తి, ఉపాధ్యాయులు రమేశ్, భిక్షపతి, దూదిపాల సాంబ రెడ్డి, పంచిక భగవాన్ రెడ్డి, బుర్ర సదయ్య, మాజీ సర్పంచ్ తిరుపతి పాల్గొన్నారు.

ఇసుక డంపుల స్వాధీనం



మొగుళ్లపల్లి: ఇసుక డంపులను సీజ్ చేస్తున్న అధికారులు



రేగొండలో..

మొగుళ్లపల్లి: మండలంలోని కొర్కిశాల గ్రామ పంచాయతీ పరిధిలోని బద్దంపల్లె శివారులో గుర్తుతెలియని వ్యక్తులు చట్ట విరుద్ధంగా ఇతర ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న సుమారు 25 ట్రిప్పుల ఇసుక డంపులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకు ఇసుక డంపును పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌కు అప్పగించినట్లు తహసీల్దార్ సునీత, ఎస్సై అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాగుల నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలించడం నేరమని అక్రమంగా తరలిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇసుక లారీ, ట్రాక్టర్ సీజ్

రేగొండ: మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన ఓ ఇసుక లారీ, చిట్యాల మండలం కాల్వపల్లికి చెందిన ఓ ఇసుక ట్రాక్టర్‌ను శుక్రవారం సీజ్ చేసినట్లు ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. లింగాల క్రాస్ వద్ద పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో వారి వద్ద సరైన పత్రాలు లేకపోవడంతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ మేరకు లారీ, ట్రాక్టర్‌ను సీజ్ చేసి లారీ యాజమాని నడిపెల్లి శ్రీనివాసరావు, ట్రాక్టర్ యాజమాని ముర్రి హరీష్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే మండలంలోని దమ్మన్నపేట, రాయపల్లి, లింగాల గ్రామాల్లో అక్రమంగా నిల్వ ఉన్న ఇసుకను సీజ్ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బతుకమ్మ విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ప్రారంభిస్తున్న సత్యనారాయణ

రేగొండ: మండలంలోని రంగయ్యపల్లి గ్రామంలో బతుకమ్మ తల్లి విగ్రహాన్ని వాసవి క్లబ్ వైస్ గవర్నర్ సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆనందంగా జరుపుకునే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ గౌరవ అధ్యక్షులు కటకం రాజు ఉపాధ్యాక్షులు మురళీదర్ నాయకులు దగ్గు వెకటేశ్వర్లు, చిలువేరు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

టేకుమట్ల: మండలంలోని నవాబుపేటలో నూతనంగా నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శుక్రవారం కన్‌స్ట్రక్షన్ డీఈ సదానందం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్ నిర్మాణానికి సంబంధించిన అనువైన పూర్తి వివరాలను సేకరించి నివేదిక రూపొందించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎమ్మార్పీ సిటీ మీటర్ ఏడీ, ఆపరేషన్ డీఈ, స్థానికులు ఉన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



దగ్ధమైన ఇల్లు

ములుగు రూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని బరిగలానిపల్లిలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బరిగలానిపల్లి గ్రామానికి చెందిన బరిగెల సురేందర్ రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. గమనించిన ఆయన కుటుంబ సభ్యులను ఇంటి నుంచి బయటకు తీసుకు వచ్చి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందజేశారు. గ్రామస్తులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసిన మంటలను నియంత్రించలేక పోయారు. ఫైర్ ఇంజన్ వచ్చే లోపు ఇల్లు పూర్తిగా కాలి బూడిదయింది. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. అగ్ని ప్రమాదంలో సుమారు రూ.ఐదు లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని అన్నారు.

'చేయూత' ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో చరిత మెడికల్ షాపు ఆవరణంలో చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో మండల కేంద్రానికి చెందిన యువకులు పది యూనిట్ల రక్తాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సాయి ప్రకాశ్ మాట్లాడుతూ.. ఏటూరునాగారం ప్రభుత్వ వైద్యశాలలో రక్తం కొరత ఉన్నందున మండల కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించామని రక్తదాన శిబిరంలో సేకరించిన రక్తాన్ని వైద్యశాలకు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రమ్మూర్తి, సాయి పవన్, రావుల నరేంద్ర కుమార్, జగదీశ్ తదితరులు ఉన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న రవీందర్

టేకుమట్ల: హైదరాబాద్ ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి తండ్రి పింగిళి జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మండలంలోని ద్వారకపేట గ్రామానికి చెందిన ప్రశాంత్‌రెడ్డి బాల్య మిత్రుడు, ఎస్సారెస్పీ మాజీ చైర్మన్ ఆకుల రవీందర్ శుక్రవారం పరామర్శించారు. రేగొండ మాజీ జెడ్పీటీసీ పత్తి ప్రభాకర్, జీల కుమారస్వామి ఉన్నారు.

గ్యానం సారయ్య ఆశయ సాధనకు కృషి



సారయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): సీపీఎం దివంగత నాయకుడు గ్యానం సారయ్య ఆశయ సాధన కోసం ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు బండారు రవి కుమార్, సూడి కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గ్యానం సారయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సారయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, నాయకులు సాంబశివరావు, రాజేందర్, కుమ్మరి శ్రీను, చిరంజీవి తదితరులు ఉన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులు అందజేస్తున్న సంస్థ సభ్యులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని చిరుతపల్లి గ్రామంలో ఇటీవల ఇల్లు కూలిపోయిన బాధిత కుటుంబానికి కాఫెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు గురువారం చేయూతను అందించారు. ఈ మేరకు అట్టం కృష్ణమూర్తి కుంటుంబానికి నిత్యావసర సరుకులు, బియ్యం, వంట సామగ్రి, ప్లేట్లు, టవల్స్, బెడ్ షీట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాఫెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ మండల కొఆర్డినేటర్ గొంది హనుమంతు, సభ్యులు కామేశ్ తదితరులు ఉన్నారు.

దుండగుల కోసం పోలీసుల వేట

- సవాల్‌గా బస్వాపూర్ ఘటన
- ప్రాథమిక ఆధారాలతో విచారణ

కాటారం : మండలంలోని బస్వాపూర్ వద్ద గురువారం తెల్లవారుజామున షాపులో చోరీకి పాల్పడి భార్య,భర్తలపై దాడి చేసిన దుండగుల కోసం పోలీసులు వేట ప్రారంభించారు. ఘటనా స్థలంలో దుండగులు ఎలాంటి ఆనవాళ్లు వదలకపోవడంతో అక్కడ దొరికిన ప్రాథమిక ఆధారాలతో పాటు సమీపంలోని మేడిపల్లి టోల్‌గేట్ వద్ద రికార్డు అయిన సీసీ ఫుటేజీల ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు. సంఘటన స్థలంలో జీరో ఎవిడెన్స్ ఉండడంతో కేసు ఛేదన పోలీసులకు సవాల్‌గా మారింది. దుండగులు చోరీకి పాల్పడిన అనంతరం ఇంటి యజమానికి సంబంధించిన బైక్‌ను పట్టుకొని పరారయ్యారు. దీంతో నిందితులు వెళ్లే మార్గాలైన కాటారం వైపుగా కొత్తపల్లి, చింతకాని క్రాస్, గారెపల్లి ప్రధాన కూడలి, మల్హర్ మండలం రుద్రారం, కొయ్యూర్, మహాముత్తారం మండలం యామన్‌పల్లి, మహాముత్తారం, భూపాలపల్లిలో అక్కడక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శుక్రవారం పోలీసులు పరిశీలించినట్లు తెలిసింది. నిందితులు దంపతులను విచక్షణారహితంగా కొడుతూ మీ ట్రాక్టర్, డబ్బులు, నగలు ఎక్కడ అని ప్రత్యేకంగా ప్రశ్నించడంతో పాటు మీరు ఇక్కడి నుంచి కిరాణం తీసివేసి వెళ్లిపోవాలని వార్నింగ్ ఇచ్చినట్లు బాధితులు బంధువులతో తెలిపినట్లు తెలిసింది. ఇది పోలీసుల వరకు చేరడంతో వారు అటు దిశగా విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. నిందితుల్లో స్థానికులు ఒక్కరో ఇద్దరో ఉండి ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాటారం సీఐ నాగార్జునరావు ఆధ్వర్యంలో పోలీసులు నాలుగు టీంలుగా ఏర్పడి విచారణ చేపడుతున్నారు. ఎస్సై అభినవ్ ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామంలో కలియతిరిగి వివరాలు సేకరించారు. ఒకటి రెండు రోజుల్లో కేసు ఓ కొలిక్కి రానున్నట్లు సమాచారం. కాగా మండలంలో మొదటిసారిగా ఇలాంటి చోరీ జరగడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని నిత్యం పెట్రోలింగ్ చేపడుతూ రక్షణగా ఉంటామని పోలీస్ అధికారులు భరోసా కల్పిస్తున్నారు.

నెరవేరిన ప్రజల చిరకాల కల

- మంత్రి సీతక్క



సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ పనులను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

ఏటూరునాగారం: ఏజెన్సీ ప్రజల చిరకాల కల నెరవేరిందని, ఎన్నో సంవత్సరాల నుంచి సెంట్రల్ లైటింగ్ సిస్టం కావాలని ప్రజలు అనేక మార్లు విన్నవించారని రాష్ట్ర పంచాయతీరాజ్, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ పనులను కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సుమారు మూడు కిలోమీటర్ల మేర ఉన్న ప్రధాన రోడ్డు మధ్యలోని డివైడర్లలో సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందు కోసం సీఆర్‌ఎస్ గ్రాంటు నుంచి రూ.75 లక్షల మంజూరు చేసినట్లు తెలిపారు. ఫిష్ మార్కెట్ నుంచి వై జంక్షన్ వరకు ప్రజలకు కావాల్సిన విధంగా పనులు చేయించాలని అధికారులను ఆదేశించారు.

వసతి భవనం ప్రారంభం

మండల పరిషత్ కార్యాలయంలో రూ.29.98 లక్షలతో నిర్మించిన అదనపు గదుల వసతి భవనాన్ని మంత్రి సీతక్క ప్రారంభించారు. అధికారులు, వీవీఐపీలు వచ్చినా, జెడ్పీటీసీగా ఎన్నికైన వ్యక్తికి ఈ కార్యాలయం ఉపయోగపడుతుందన్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకుడు పోగుల లక్ష్మీనారాయణ నిర్మించిన ఎస్‌ఎల్‌ఎన్ ఫంక్షన్ హాల్‌ను సీతక్క ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీ సీఈఓ సంపత్‌రావు, ఎంపీడీఓ రాజ్యలక్ష్మి, తహసీల్దార్ జగదీశ్, ఎంపీఓ కుమార్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, బ్లాక్ అధ్యక్షుడు వెంకన్న, మండల అధ్యక్షుడు రఘు దేవేందర్ పాల్గొన్నారు.

త్రీఫేజ్ విద్యుత్ ఇవ్వాలని వినతి

మండలంలోని కొండాయి, దొడ్ల, మల్యాల గ్రామాల్లోని రైతుల పంట పొలాలకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా అందించాలని మంత్రి సీతక్కకు కొండాయి మాజీ సర్పంచ్ కాక వెంకటేశ్వర్లు శుక్రవారం మండల కేంద్రంలో వినతిపత్రం అందజేశారు. 1986 సంవత్సరంలో జంపన్నవాగు వరదల కారణంగా పంట పొలాల్లో ఇసుక మేటలు వేయడంతో వాటికి ఉన్న పట్టాలను తొలగించారని, మళ్లీ వాటికి పట్టాలు ఇవ్వాలని కోరారు. అలాగే వెంకటాపురం(కె) మండలం ఎదిర గ్రామానికి చెందిన కొండగొర్ల కల్యాణికి మెదడులో గడ్డకట్టి నరాలు చచ్చుబడిపోవడంతో తన బిడ్డను ఆదుకోవాలని తల్లిదండ్రులు మంత్రి సీతక్కను వేడుకున్నారు. స్పందించిన సీతక్క కొండాయిలో నెలకొన్న సమస్యలను కలెక్టర్‌తో చర్చించి పరిష్కారం చూపుతామన్నారు. కల్యాణికు నిమ్స్‌లో ఉచితంగా చికిత్సలు అందిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా రొయ్యూర్‌కు చెందిన బాధితులు తమ గోదావరి ముంపునకు గురవుతున్నామని ఇప్పలగడ్డ వద్ద ఉన్న స్థలాలను ఇళ్లకు కేటాయించాలని మొరపెట్టుకున్నారు.